నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. పాపిరెడ్డినగర్ ఫీడర్ పరిధిలోని పాపిరెడ్డి నగర్, ప్రగతినగర్, రామకృష్ణనగర్‌లో ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు..

- పాపారాయుడు ఫీడర్ పరిధిలోని పాపారాయుడు నగర్, ఏవీబీ పురం, రామారావునగర్, సాయిబాబానగర్‌లలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు..
- నయన్ కన్‌స్ట్రక్షన్ ఫీడర్ పరిధిలోని పాపారాయుడు నగర్, వైష్ణవి నగర్, రామారావునగర్, నయన్ అపార్టుమెంట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- **మూసాపేట:** విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు బాలాజీనగర్ ఏఈ ఆర్.శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు.
- ఆంజనేయ ఫీడర్ పరిధిలోని ఆంజనేయనగర్ రోడ్ నం. 5 నుంచి 12 వరకు జీహెచ్‌యంసి కార్యాలయం, కూకట్‌పల్లి, మూసాపేట ఆంజనేయనగర్ చౌరస్తా ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు...
- పుల్లారెడ్డి ఫీడర్ పరిధిలోని సేవాలాల్ తండా, కైత్లాపూర్, రెయిన్‌బో విస్టాస్ సైబర్ సిటీ, పుల్లారెడ్డి కాంపౌండ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30గంటల వరకు...
- ఐడీఎల్ ఫీడర్ పరిధిలోని ఐడీపీఎల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 30.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చేనేత హస్తకళ ప్రదర్శనకు విశేష స్పందన



కళాసిల్క్ ఎగ్జిబిషన్‌లో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమిటీహాల్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ మేళాలో ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కళంకారి, ఉపాడ వంటి చీరలతో పాటు అస్సాం, బాగల్పూర శిల్క్స్, టస్సర్, ట్రైబల్ వర్క్స్ కోసా శిల్క్, బాందని, కచ్ఛ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీలు, ఎంబ్రాయిడరీ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, ప్రింటెడ్ చీరలు, చందేరి, మహేశ్వరి చీరలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు వినోద్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా లక్నో హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్, డోర్ కర్టెన్, జైపురి స్టోన్ జ్యువెలరి, పెరల్స్, ఉడన్ హ్యాండీ క్రాఫ్ట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఈ ఎగ్జిబిషన్ 7 రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మోతీనగర్ పరిసర ప్రాంత వాసులు వినియోగించుకోవాలని కోరారు.

'కాంగ్రెస్‌కు ఓటేస్తే మునిగినట్టే'

పంజగుట్ట: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తే నిరుద్యోగుల జీవితాలు ఆగమౌతాయని నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర సభ్యులు ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలు శాసనమండలిలో లేవనెత్తాలన్నా, వారి సమస్యలపై ధైర్యంగా పోరాడాలన్నా బక్కా జడ్సన్‌కు ఓటువేసి శాసన మండలికి పంపాలని వారు పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిరుద్యోగ బస్సు యాత్ర సభ్యులు జనార్దన్, గోపాల్, యుగంధర్, శరత్‌లు మాట్లాడుతూ... కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రశ్నించే గొంతు కాదని, రాష్ట్రంలోనే అతిపెద్ద బ్లాక్‌మెయిలర్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే మూడు రోజులు మూడు జిల్లాలు పర్యటించి జడ్సన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు. నిరుద్యోగులు బాగా ఆలోచించి మన సమస్యలు తీరాలంటే సీరియల్ నెంబర్ 41 మీద మీ మొదటి ప్రాధాన్యత, లేదా రెండవ ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

నాలా పై వంతెనను అందుబాటులోకి తీసుకురావాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్‌లోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ ఎదుట ఉన్న నాలాపై నిర్మించిన వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని మాధవరం కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మాధవరం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆకుల వీరస్వామి, మేడ్చల్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ గురువారం జోనల్ కమిషనర్, డీసీలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ వంతెనను అందుబాటులోకి తీసుకొస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. మరో నెలలో పాఠశాలలు, కాలేజీలు తెరుచుకోనున్న నేపథ్యంలో వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పాత బ్రిడ్జి పక్కన వానాకాలంలో వరద నీరు నిలిచిపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంటుందన్నారు.

మాజీ వీసీలపై విచారణ చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వివిధ వర్సిటీలలో వీసీలుగా పని చేసిన వారిపై విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు తొత్తులుగా వ్యవహరిస్తూ వర్సిటీల అభివృద్ధిని అడ్డుకొని స్వయంప్రతిపత్తిని (అటానమస్) బలహీన పరిచారని ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ వీసీలపై విచారణ జరపాలన్నారు.

ఓయూ మాజీ వీసీపై..

కేయూ మాజీ వీసీపై తీసుకున్న చర్యల తరహా ఓయూ మాజీ వీసీ ప్రొ.రవీందర్‌పై తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. వేతన బకాయిల చెల్లింపు, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు, పదవులు, పదోన్నతుల అక్రమాలపై ప్రశ్నించిన అధ్యాపకులను ముప్పు తిప్పలు పెట్టిన మాజీ వీసీ ప్రొ.రవీందర్ పై కూడా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తన మూడేళ్ల పాలనలో ఇష్టారాజ్యాంగా వ్యవహరించిన ప్రొ.రవీందర్ సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులపై ప్రొ.తిరుపతిరావు సమర్పించిన నివేదికను బహిర్గతం చేయలేదన్నారు. 2016 నుంచి 2019 వరకు గల అధ్యాపకులందరికి వేతన బకాయిలు చెల్లించాలని కోరారు.

దొంగలున్నారు జాగ్రత్త!

- రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలు
- మహిళలు సైతం ఇళ్లలోకి వెళ్లి దోచుకెళ్తున్న వైనం
- వైరల్ అవుతున్న దొంగల సీసీటీవీ ఫుటేజీలు
- పోలీసు పెట్రోలింగ్ పెంచాలని స్థానికుల డిమాండ్



ధరణినగర్‌లో ఓ ఇంట్లోకి వెళ్లి రంగు డబ్బాలు ఎత్తుకెళ్తున్న యువతి

ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోతున్నారు. నిర్మానుష్యంగా ఉండే బస్తీలు, కాలనీలను టార్గెట్‌గా చేసుకుని అందినకాడికి దోచుకుంటున్నారు. వేసవిలో బిల్డింగ్‌లపై పడుకునే వారి ఇళ్లను ఎండ తాపానికి అలసి పోయి గాఢ నిద్రలో ఉన్న సమయంలో దొంగలు ఇళ్లల్లోకి వెళ్లి వస్తు సామగ్రిని ఎత్తుకెళ్లిపోతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్ల పరిధిలో దొంగల తీవ్రత ఎక్కువ ఉందని స్థానికులు చెబుతున్నారు.

ఇటీవల పలు ప్రాంతాల్లో జరిగిన చోరీలు..

- ఆల్విన్‌కాలనీ ధరణినగర్‌లో ఓ ఇద్దరు మహిళలు రాత్రివేళల్లో కాలనీల్లో సంచరిస్తూ ఇళ్లల్లోకి వెళ్లి రంగుడబ్బాలు, నల్లాలు, కొత్తగా నిర్మించే అపార్టుమెంట్‌లలోని విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఉదయం వేళల్లో ఇంటి ముందు ఉన్న రంగు డబ్బాలు లేకపోవటంతో సొసైటీ కార్యాలయంలోని సీసీ ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు మహిళలు ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు.
- జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌లోని ఓ వీధిలో ఇద్దరు వ్యక్తులు ఒకే బైక్‌పై హెల్మెట్ ధరించి మొహాలు గుర్తుపట్టకుండా కాలనీలో సంచరిస్తూ ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. ఉదయం సీసీ కెమెరాలు పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు బైక్‌ను ఎత్తుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. దీంతో ఆ వ్యక్తి జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెట్రోలింగ్ లేకనే దొంగతనాలు

- పగలు, రాత్రి వేళల్లో స్థానిక పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవటం వల్లనే ఇటువంటి దొంగతనాలు పెరిగి పోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో దొంగతనాలు జరగకుండా గస్తీ పెంచాలని కోరుతున్నారు. కొత్తవారు ఎవరైనా అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పలు సంక్షేమ సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



దొంగలను కట్టడి చేయాలి..



రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు కాలనీ, బస్తీల్లో సంచరిస్తున్నారు. విలువైన వస్తువులు లేకుంటే అందిన వస్తువులు ఎత్తుకెళ్తున్నారు. కొత్తగా మహిళలు కూడా చోరీలు చేస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేసి దొంగలను కట్టడి చేయాలి.

– గోపాల్, ధరణినగర్ అధ్యక్షుడు

నిఘా పెంచాలి..



పాపిరెడ్డినగర్‌లోని ప్రతి వీధి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. అయినా దొంగలు బయట పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగిలిస్తున్నారు. ఉదయం లేచి చూసే సరికి వాహనాలు కనిపించడం లేదు. పోలీసులు ఈ దొంగలను త్వరగా పట్టుకోవాలి. నిఘా పెంచి అసలు దొంగతనాలే జరగకుండా చూడాలి.

– ఊట్ల చంద్రారెడ్డి, పాపిరెడ్డినగర్ అధ్యక్షుడు



వైశాఖ పౌర్ణమి సందర్భంగా శంకరమఠం ఆవరణలో నిర్వహించిన చండీ హోమం

యజ్ఞ హోమాలతో శాంతి, సౌభాగ్యాలు

మోతీనగర్: యజ్ఞహోమాలతో శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని మోతీనగర్ శంకర మఠం కార్యనిర్వాహణ అధికారి సీఎస్ఆర్ మూర్తి పేర్కొన్నారు. గురువారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా శంకరమఠం ఆవరణలో చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పూర్వం రాజులు రాజ్యాలను కై వసం చేసుకోవడానికి శాంతి యుత వాతావరణంలో హోమాలు నిర్వహించే వారన్నారు. నేడు శాంతి సౌభాగ్యాలు, సుఖ సంతోషాలు కలగడానికి ఈ హోమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

'ఫిక్కి' ఆధ్వర్యంలో గ్లోబల్ అలయన్స్ సెషన్

పంజగుట్ట: భారతీయ మార్కెట్ అంటే తమకు ఎంతో ఇష్టమని హైదరాబాద్ లోని యునైటెడ్ స్టేట్స్ కాన్సులర్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. గురువారం ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో స్ట్రెంథనింగ్ ఎకనమిక్ బ్రిడ్జెస్ అనే అంశంపై గ్లోబల్ అలయన్స్ సెషన్ నిర్వహించారు. ఎఫ్ఎల్ఓ చైర్ పర్సన్ ప్రియా గజ్దర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జన్నిఫర్ లార్సన్, ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ ఆఫ్ ఆస్ట్రేడ్ ఇన్ సౌత్ ఏషియా డెనిస్ ఈటన్, గారెత్ ఓవెన్‌లు పాల్గొన్నారు. ప్రస్తుతం మనం గ్లోబల్ విలేజ్‌లో నివసిస్తున్నామని దేశాల మధ్య వాణిజ్యం గతంలో కన్నా ఎంతో సరళంగా మారిందని తెలిపారు. అంతర్జాతీయ వాణిజ్యం సాధారణంగా కంపెనీలను, ప్రత్యేకంగా ఫిక్కి సభ్యులను మార్కెట్ విస్తరించడానికి ఈ సెషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

'ఉస్మానియా' సమస్యలు పరిష్కరించాలి

ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు పీవైఎల్ వినతి

ముషీరాబాద్: ఉస్మానియా ఆసుపత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) డిమాండ్ చేసింది. గురువారం ఆసుపత్రి సూపరెండెంట్ బి.నాగేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై రోగుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజూ అవుట్ పేషంట్లు భారీ సంఖ్యలో వస్తున్నందున ఫార్మసీ వద్ద ఎనిమిది కౌంటర్లు ఏర్పాటు చేసినా తీవ్ర జాప్యమవుతోందని, వృద్ధులు సైతం బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. అన్ని రకాల మందులు అందుబాటులో లేవని కొన్ని మందులు సగమే ఇస్తున్నారని చెప్పారు. బ్లడ్, ఇతర టెస్టులు, ఫలితాలకు ఎక్కువ రోజుల సమయం తీసుకోవడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. నూతన బిల్డింగ్ నిర్మాణం చేపడితే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, ఎం. రవికుమార్, బీఎస్ కృష్ణ, కొల్లూరి భీమేష్, కొల్లూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డికి వీడ్కోలు

బాలానగర్: జేఎన్‌టీయూలో మూడేళ్ల పాటు వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన డా. కట్టా నర్సింహారెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సెమినార్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ ఉద్యోగులు, కళాశాలలోని ప్రొఫెసర్స్, కాంటాక్ట్ అధ్యాపకులు, పొరుగుసేవలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... తన పదవీకాలంలో సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఎవరిపైనైనా కఠినంగా ప్రవర్తించి బాధ కలిగిస్తే అది పరిపాలనలో భాగంగా జరిగినట్లుగా భావించాలన్నారు. చివరిగా ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రాజేష్‌ఖన్నా తన కవిత్వంతో సభను ముగించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ డా. కె. విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు, పలు డిపార్టుమెంట్‌ల డైరెక్టర్లు, ఫైనాన్స్ ఆఫీసర్, పరీక్షల విభాగం డైరెక్టర్ ఏ. అరుణ కుమారి, డా. శ్రీదేవి పలువురు పాల్గొన్నారు.



చైనీస్ చిప్‌లతో జాతీయ భద్రతకు ముప్పు

- రాహత్ చైర్మన్ డాక్టర్ కమల్ సోయి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రికి ఫిర్యాదు



మాట్లాడుతున్న డాక్టర్ కమల్ సోయి

సాక్షి, సిటీబ్యూరో: ట్రాన్స్‌పోర్ట్ అప్లికేషన్స్ కోసం తెలంగాణలో సరఫరా చేస్తున్న స్మార్ట్ కార్డుల భద్రత ప్రమాదంలో ఉందని రాహత్ ఎన్‌జీఓ చైర్మన్ డాక్టర్ కమల్ సోయి అన్నారు. కలర్‌ప్లాస్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సరఫరా చేస్తున్న స్మార్ట్ కార్డులపై అనుమానం వ్యక్తం చేస్తూ రాహత్ ఎన్‌జీఓకు పేరు లేని విజిల్ బ్లోయర్స్ లేఖ వచ్చిన నేపథ్యంలో ఈ మెయిల్ కాపీ ఆధారంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడలోని హోటల్ మెర్క్యురీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ., స్మార్ట్ కార్డ్ ఆపరేటింగ్ సిస్టమ్స్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అప్లికేషన్స్ (ఎస్సీఓఎస్టీఏ) ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగుతుందని ధృవీకరించడానికి, స్మార్ట్ కార్డ్ బ్యాచ్‌లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సాధారణంగా 90 శాతం నేరాలు రవాణా, వాహనాలపైన ఆధారపడి ఉంటుందని, వీటి విషయంలో నిర్లక్ష్యం సామాజికంగా తీవ్ర నష్టానికి కారణమవుతోందని తెలిపారు. తమకు అందిన లేఖలో భాగంగా..స్మార్ట్ కార్డుల్లో నాసిరకం చైనీస్ పరికరాలు ఉపయోగిస్తున్నారని, దీని వల్ల డేటా–గోప్యతకు సంబంధించిన అంశాల్లో అవకతవకలు జరిగే ప్రమాదముందన్నారు. ప్రభుత్వ ఐడీ డేటాను చైనాకు అనధికారికంగా బదిలీ చేయడమేనని, ఇది నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ భద్రతకు భరోసానిస్తూ కఠినమైన నియంత్రణ, పర్యవేక్షణ చేపట్టాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో త్వరితగతిన నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ప్రజా సంక్షేమం దృష్ట్యా న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు హెచ్చరించారు.

పశ్చిమబెంగాల్ కోర్టు తీర్పుపై హర్షం

సనత్‌నగర్: పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఓబీసీలలో అన్ని క్లాసలను కొట్టివేస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల బీజేపీ ఓబీసీ మోర్చా నేతలు హర్షం వ్యక్తం చేశారు. బేగంపేట బ్రాహ్మణవాడీలోని వినాయక మండపం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, అసెంబ్లీ ఓబీసీ కన్వీనర్ కన్నూరి చంద్రకుమార్, బేగంపేట డివిజన్ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, రాంగోపాల్‌పేట ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, పవన్, వెంకటేష్, యశ్వంత్ సమావేశమై హర్షం ప్రకటించి సంబురాలు జరుపుకున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు చున్నూ పాషాను సన్మానిస్తున్న బండి రమేష్

మూసాపేట: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు ముందుకు రావాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేట కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చున్నూ పాషా ఆధ్వర్యంలో గురువారం మూసాపేటలోని నవయువక యూత్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. జనరల్ చికిత్సతో పాటు షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 350 మంది ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేబుల్ శ్రీను, మల్లేష్‌యాదవ్, మహేష్ గౌడ్, తూము సచిన్, నయీమ్, మోసిన్, బొజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు హబీబ్‌నగర్ పార్కులో...

బాలాజీనగర్ డివిజన్ హబీబ్‌నగర్‌లోని అబ్దుల్ కలాం పార్కు వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చున్నూ పాషా తెలిపారు. ఈ శిబిరంలో షుగర్, థైరాయిడ్, జనరల్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'జీవితంలో విజయం సాధించడం ఎలా..?' పై

రేపు సింపోజియం

కాచిగూడ: వర్ణిక ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 'జీవితంలో విజయం సాధించడం ఎలా..?'అనే అంశంపై ఈ నెల 25న కాచిగూడలోని అమృత ఆర్కేడ్‌లో సింపోజియం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధానకార్యదర్శి, న్యాయవాది కాసుల వినోద్ తెలిపారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ సింపోజియం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎస్ఎస్ న్యాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్, ప్రత్యేక అతిథిగా హైకోర్టు న్యాయవాది కానుగు దేవేందర్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా ఉప్పల విద్యకల్పన

ఆల్విన్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలిగా ఉప్పల విద్యకల్పన ఏకాంత్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, నియోజకరవ్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌లకు తనను ఉపాధ్యక్షురాలిగా నియమించినందుకు విద్యకల్పన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, శేరిలింగంపల్లి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజన్, సీనియర్ నాయకుడు వీరేందర్‌గౌడ్, ఏకాంత్‌గౌడ్, కృష్ణ ముదిరాజ్, గణేష్‌గౌడ్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



31న ఫీజుల నియంత్రణపై రౌండ్‌టేబుల్ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ–ఆవశ్యకత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 31న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జస్టిస్ చంద్రకుమార్ హాజరు కానున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి తెలిపారు.

వైర్లకు అడ్డుగా ఉంటే తొలగిస్తారు.. రోడ్డుకు అడ్డుగా ఉంటే తొలగించరా?



పాండురంగనగర్ పార్కు సమీపంలో రోడ్డుపై వదిలేసిన చెట్ల మొద్దులు



మోతీనగర్ శంకర్‌మఠంలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించి వదిలేసిన దృశ్యం

మోతీనగర్: విద్యుత్ హైటెన్షన్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించటం విద్యుత్ శాఖ అధికారులు తరుచూ చేపడుతుంటారు. అంతే కాకుండా అకాల వర్షాలు కురిసినప్పుడు ఈదురు గాలులకు పడిపోయిన చెట్లను పూర్తిగా తొలిగించటం జీహెచ్‌యంసి డిఆర్‌యఫ్ సిబ్బంది చేపడుతుంటారు. మూసాపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌వైర్లకు అడ్డంగా ఉన్నాయని అదే విధంగా ఇటీవల కురిసిన ఈదురు గాలులకు చెట్లు నేల మట్టం కావడంతో ఫుట్‌పాత్‌లపై ప్రమాదకరంగా తయారయ్యాయి.

- శంకరమఠ్ ప్రాంతంలో కొన్ని రోజుల కిందట విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలను తొలగించారు. వాటిని తరలించటంలో సిబ్బంది నిర్లక్ష్యం చేపట్టడంతో ఇటీవల అకాల వర్షాలు కురుస్తున్న వర్షాలకు అవి తడిచి దుర్వాసన వెదజల్లుతున్నాయి. అంతేకాకుండా ఇటీవల ఎండిపోయిన చెట్ల కొమ్మలు రోడ్డుకు అడ్డంగా వాహనదారులు, పాదచారులకు పలు ఇబ్బందులను కలుగజేస్తున్నాయి. చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే తరలిస్తే బాగుంటుంది. కానీ పది పదిహేను రోజుల వరకు వాటిని తొలగించటంలేదు.
- ఇటీవల పాండురంగనగర్ పార్కు సమీపంలో ఫుట్‌పాత్‌పై భారీ వృక్షం ఈదురు గాలులకు నేలకొరిగింది. దానిని కొంత మేరకు డిఆర్‌యఫ్ సిబ్బంది తొలగించినా ఇంకా కొంత మేర అలాగే ఫుట్‌పాత్‌పై వదిలేశారు. పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా తయారైంది. అసలే ఆ రోడ్డు మధ్యలో డివైడర్ ఉండటంతో రోడ్డు చిన్నగా ఉండటంతో ఒక పక్క డివైడర్ మరో పక్క చెట్ల కొమ్మల మొద్దులు ఉండటంతో ఇబ్బందికరంగా తయారైంది. రాత్రివేళల్లో చెట్ల మొద్దులు కనిపించకపోవటంతో ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు.
- చెట్ల కొమ్మలు, మొద్దులను తొలగించిన వెంటనే తరలించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈదురు గాలులు వీచేటప్పుడు సంబంధిత డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్ అధికారులు వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తొలిగించిన చెట్ల కొమ్మలు, మొద్దులను తొలగించాలని పలువురు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.